క్లుప్తంగా

కోతుల దాడిలో చిన్నారికి గాయాలు



శాయంపేట : మండలంలోని తహరాపూర్ గ్రామంలో కోతుల బెడద రోజురోజుకు తీవ్రమౌతోంది. రోడ్లపై గుంపులుగా సంచరిస్తూ పండ్లు, నిత్యావసర వస్తువులు తీసుకెళ్తున్న చిన్నారులు, మహిళలపై దాడులు చేస్తున్నాయి. ఇళ్లలోకి చొరబడి తినుబండారాలను ఎత్తుకెళ్తున్నాయి. తహరాపూర్‌లో సోమవారం ఆరుబయట ఆడుకుంటున్న మానసిక వికలాంగురాలైన చిన్నారి సిరిపై కోతులు దాడి చేసి గాయాల పాల్జేశాయి. చిన్నారిని శాయంపేట పీహెచ్‌సీకి, అక్కడి నుంచి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అదేరోజు జిట్టబోయిన సమ్మక్క కిరాణా షాపునకు వెళ్లి వస్తుండగా కోతులు దాడి చేయడంతో ఆమె రాళ్లపై పడి గాయాల పాలైంది. కోతుల బెడద నుంచి తమను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అగ్రంపహాడ్ మినీ జాతర హుండీల లెక్కింపు

ఆత్మకూరు : మండలంలోని అగ్రంపహాడ్ సమ్మక్క–సారలమ్మ మినీ జాతర ప్రాంగణంలో హుండీలను సోమవారం లెక్కించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ పర్యవేక్షణాధికారి అనిల్‌కుమార్ వివరాలు వెల్లడించారు. జాతయ ఆదాయం రూ.82,949 వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ శేషగిరి, పూజారులు గుల్లపెల్లి సాంబశివరావు, గోనెల సారంగపాణి, వెంకన్న, సర్పంచ్ మాదాసి అన్నపూర్ణ, ఎంపీటీసీ బొమ్మగాని భాగ్య, క్లర్క్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించండి

నడికూడ : మండల కేంద్రంలోని జెడ్పీ స్కూల్‌లో 'మన ఊరు–మన బడి'లో భాగంగా చేపట్టిన పనుల బిల్లులు చెల్లించాలని సర్పంచ్ ఊర రవీందర్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. పాఠశాలలో రూ.2.10 లక్షల వ్యయంతో ఎలక్ట్రిషన్ పనుల చేయగా సంబంధిత ఏఈ, డీఈ ఎంబీ రికార్డ్ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం స్కూల్ ఖాతాలో రూ.2.10 లక్షలు జమ చేసినా ప్రధానోపాధ్యాయుడు పట్టాభి బ్యాంకు నుంచి డ్రా చేసి ఇవ్వడం లేదని వాపోయారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని బిల్లు ఇప్పించాలని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

శాయంపేట : నేడు (మంగళవారం) మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

పరామర్శ



శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి రంగారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి సోమవారం పరామర్శించారు. రంగారెడ్డి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని సంతాపం తెలిపారు. అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా మాజీ అధ్యక్షుడు తాడికొండ రవికిరణ్, గంగుల రమణారెడ్డి, సత్యనారాయణ, రాఘవేంద్ర శర్మ, కరుణాకర్, విద్యాసాగర్, కృష్ణమూర్తి, సంతోష్, శ్రీను, స్రవంతి, సాంబయ్య పాల్గొన్నారు.

నంది అవార్డు ప్రదానం



శాయంపేట : అవార్డు అందుకుంటున్న రఘు

ఐనవోలు/శాయంపేట : హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని గర్మిళ్లపెల్లి గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు గబ్బెట కృష్ణ, శాయంపేట మండలంలోని తహరాపూర్ గ్రామానికి చెందిన మిద్దపాక రఘులకు నంది అవార్డు లభించింది. తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, ప్రముఖ కళాకారులు ఏపూరి సోమన్న, దరువు అంజన్న చేతుల మీదుగా కృష్ణ, రఘు నంది పురస్కారాన్ని అందుకున్నారు. అవార్డు రావడానికి సహకరించారంటూ కృష్ణ, రఘు తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు బుల్లెట్ వెంకన్న, ఉపాధ్యక్షుడు పాలాటి రాజు, ప్రధాన కార్యదర్శి బిర్రు సురేందర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ వర్సెస్ బీఆర్‌ఎస్.. ఐదుగురు అరెస్ట్

కమలాపూర్ : మండలంలోని పంగిడిపల్లి గ్రామంలో బీజేపీ, బీఆర్‌ఎస్ శ్రేణుల నడుమ చోటు చేసుకున్న పరస్పర దాడుల నేపథ్యంలో బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ సంజీవ్ తెలిపారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పంగిడిపల్లికి వెళ్లి కమలాపూర్‌కు వస్తున్న క్రమంలో పరస్పర దాడులు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో బీజేపీ నాయకులు తమపై దాడి చేసి గాయపర్చారంటూ పంగిడిపల్లికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త బాస్పాటి వీరేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కమలాపూర్‌కు చెందిన బీజేపీ కార్యకర్తలు మాట్ల రమేష్, పిల్లి సతీష్‌తోపాటు మరికొందరిపై సోమవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అలాగే పంగిడిపల్లికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు దుర్గునాల శ్యాంరావు, బాస్పాటి వీరేశం, హింగె గణేష్, ఆల్లపురం రవీందర్, కొడగాని ప్రవీణ్, దుర్గునాల భద్ర గ్యాస్ ప్లాంట్ సమీపంలో రోడ్డుకు అడ్డంగా ఎడ్ల బండ్లు, బైక్‌లు అడ్డుపెట్టి అడ్డుకుని వాటిని తొలగిస్తుండగా తనను కులం పేరుతో దూషించి పిడిగుద్దులు గుద్దుతూ దాడికి పాల్పడ్డారంటూ బీజేపీ నాయకుడు మాట్ల రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు ఆరుగురిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

పోలీసుల అదుపులో ఐదుగురు బీజేపీ కార్యకర్తలు

బీజేపీ, బీఆర్‌ఎస్ కార్యకర్తల పరస్పర దాడుల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలకు గాయాలైన కేసులో ఐదుగురు బీజేపీ కార్యకర్తలను సోమవారం తెల్లవారుజామున టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. కాగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు బీజేపీకి చెందిన మాట్ల రమేష్, మాట్ల కళ్యాణ్, పిల్లి సతీష్, తుమ్మ శోభన్, పంగిడిపల్లి సర్పంచ్ చేలికె శ్రీనివాస్ లను రహస్యంగా ఓ పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. దీంతో మండల కేంద్రంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్‌ఎస్ నాయకులను వదిలి బీజేపీకి చెందిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని బీజేపీ నేతలు ఖండించారు.

భారీగా మోహరించిన పోలీసులు

బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులపై కేసులు, ఐదుగురు బీజేపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్న క్రమంలో కమలాపూర్ మండలంలో పోలీసులు భారీగా మోహరించారు. కాజీపేట ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కమలాపూర్ సీఐ సంజీవ్, హసన్‌పర్తి సీఐ నరేందర్, ఎల్కతుర్తి, ముల్కనూర్ ఎస్సైలు పరమేష్, ప్రవీణ్‌కుమార్‌తోపాటు పెద్ద ఎత్తున పోలీసు బలగాలు కమలాపూర్ బస్టాండ్, గుడిబండతోపాటు ప్రధాన కూడళ్ల వద్ద బందోబస్తు నిర్వహించారు.



కమలాపూర్‌లో మోహరించిన పోలీసులు

'ప్రశాంత వాతావరణాన్ని చెడగొడుతున్నారు'

కమలాపూర్: అధికార పక్షం నేతలు ప్రజలపై దాడులు చేస్తూ.. బీజేపీ కార్యకర్తలను అకారణంగా కొడుతూ హుజూరాబాద్‌లో ప్రశాంత వాతావరణాన్ని చెడగొడుతున్నారని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈనెల 5న బీఆర్‌ఎస్ కార్యకర్తలు మా పార్టీ కార్యకర్తలపై దాడి చేశారని, అయితే దాడి చేసిన వారిని వదిలిపెట్టి మా నేతలు, కార్యకర్తలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు తీసుకెళ్లి విపరీతంగా కొడుతున్నారని ఆరోపించారు. పోలీసులు అధికార పక్షం తొత్తులుగా మారారని, బీజేపీ కార్యకర్తలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు తీసుకెళ్లాల్సిన అవసరం ఏమిటని? కొట్టడం ఏమిటని? చట్టం పని చేస్తుందా? లేదా? అని రాష్ట్ర డీజీపీని ప్రశ్నించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు తీసుకెళ్లిన బీజేపీ నేతలు, కార్యకర్తలు రమేష్, కల్యాణ్, సతీష్, శోభన్, పంగిడిపల్లి సర్పంచ్ శ్రీనివాస్‌ను విడుదల చేయాలని ఈటల డిమాండ్ చేశారు.

మంచు కురిసే వేళలో..



ఎల్కతుర్తి : ప్రధాన రహదారిపై కురిసిన మంచు



కమలాపూర్ : రామాలయం వద్ద..

ఎల్కతుర్తి : మంచు కురిసే వేళలో.. అన్న పాట గుర్తు చేసేలా మండల కేంద్రంలో సోమవారం పొగమంచు కురిసింది. ఉదయం 6:30 నుంచి 9.30 గంటల వరకు కురిసిన పొగమంచుతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. దారి కనిపించక పలువురు వాహనాదారులు వాహనాలకు హెడ్‌లైట్లు వేసుకొని నెమ్మదిగా వెళ్లిన పరిస్థితి చోటు చేసుకుంది. బాటసారులు, వ్యవసాయ బావులు, పొలాల వద్దకు వెళ్లే రైతులు, బడులకు వెళ్లే విద్యార్థులు సైతం స్వెట్టర్ వేసుకొని మంచులో వణకుతూ వెళ్లడం కనిపించింది. సుమారు 9.30 గంటల తర్వాతే సూర్యుడు కిరణాలను విరజిమ్ముతూ పొగమంచును చీల్చుతూ వెలుతురు ప్రసరింపజేయడంతో ప్రజలు చలి, మంచు నుంచి ఉపశమనం పొందారు.

కమలాపూర్‌ను కమ్మేసిన..

కమలాపూర్ : మండలాన్ని ఉదయం పొగమంచు కమ్మేసింది. తెల్లవారుజాము నుంచి దట్టమైన పొగమంచు కమ్మేయడంతో వాహనదారులు, మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ, ద్విచక్ర, ఇతర వాహనదారులు హెడ్‌లైట్ల వెలుగులో ప్రయాణించాల్సి వచ్చింది. పొగమంచు తొలిగిపోయే వరకు ప్రజలు స్వెట్టర్లు ధరించినా చలి వణికించింది. వ్యవసాయ, ఇతరత్రా కూలీలు పొగమంచులోనే పనులకు వెళ్లారు. ఉదయం సుమారు 8.30 తర్వాత మంచు క్రమంగా తొలిగిపోయింది

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

ఎల్కతుర్తి : ఐక్యపోరాటాలతోనే ప్రజాసమస్యలు పరిష్కారమౌతాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపెల్లి శ్రీనివాస్‌రావు స్పష్టం చేశారు. పేదలకు అండగా నిలిచేది ఎర్రజెండా మాత్రమేనని ఆయన తేటతెల్లం చేశారు. మండల కేంద్రంలో పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆ పార్టీ జిల్లా స్థాయి శాఖ కార్యదర్శుల రాజకీయ శిక్షణా తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా శ్రీనివాస్‌రావు హాజరై మాట్లాడారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు అధికారమే లక్ష్యమన్నారు. సీపీఐకి మాత్రం ప్రజాసమస్యల పరిష్కారమే ఏకైక ధ్యేయమని చెప్పారు. రైతులు, కార్మికులు, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, అన్ని తరగతుల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసి ప్రజలను సమీకరించి అవగాహన కల్పించి చైతన్యవంతం చేసి పోరాటాల దిశగా నడిపించడమే పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు. ఓట్ల కోసం వచ్చే బూర్జువా పార్టీలను ప్రజలు నమ్మొద్దని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను విస్మరించి మోసపూరిత పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. యువతకు ఉద్యోగాలు, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, ఇతర హామీలు అమలు చేసేలా పాలకుల మీద ఒత్తిడికి తెచ్చేందుకు పోరాడాలని సూచించారు. సమావేశంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యుడు ఆదారి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, సీనియర్ నాయకుడు మోతె లింగారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్రె లక్ష్మణ్, మర్రి శ్రీనివాస్, రమాదేవి, మండల కార్యదర్శి ఉట్కూరి రాములు, నిమ్మల మనోహర్, సదానందం, చంద్రమౌళి, రాజ్‌కుమార్, రాజనర్సు, శ్యామ్, తిరుమల, లలిత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తక్కళ్లపెల్లి శ్రీనివాస్‌రావు

'తొలిమెట్టు'తో విద్యాసామర్థ్యం పెంపు

ధర్మసాగర్ (వేలేరు) : తొలిమెట్టు కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో విద్యాసామర్థ్యం పెంపునకు బాటలు పడనున్నాయని విద్యాశాఖ జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంఓ) శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని పీచర జెడ్పీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు పి.నవీన్‌కుమార్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ప్రాథమిక స్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. బోధ, అభ్యసన విజయానికి టీఎల్‌ఎం ఉపయోగపడుతుందని తెలిపారు. టీచర్లందరూ టీఎల్‌ఎం ఉపయోగించాలని సూచించారు. పిల్లలు బడి బయట, డ్రాపవుట్ లేకుండా చూడాలని కోరారు. విద్యార్థుల సామర్థ్యం పెంచే దిశగా ఉపాధ్యాయులు చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం హన్యానాయక్, ఆర్పీ ఎన్ ప్రవీణ్‌కుమార్, సుమన్ బాబు, నాగజ్యోతి, సీఆర్పీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎంఓ శ్రీనివాస్

కస్తూర్బా విద్యాలయలో..

మండలంలోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయాన్ని ఏఎంఓ శ్రీనివాస్ సందర్శించారు. స్పెషల్ ఆఫీసర్ స్రవంతితో, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థునులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. పది జీపీఏ సాధించేలా టెన్త్ విద్యార్థులు చదవాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ మొగిలిచర్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి'

● సూర్యపేట జిల్లా ఇన్‌చార్జ్ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న చాడ శ్రీనివాస్‌రెడ్డి

ఎల్కతుర్తి : బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ సూర్యపేట జిల్లా ఇన్‌చార్జ్ చాడ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండలంలోని దామెర గ్రామంలో పార్టీ జెండాను ఆయన సోమవారం ఆవిష్కరించారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు కుడితాడి చిరంజీవి ఆధ్వర్యంలో నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. మండలంలో గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసే దిశగా నాయకులు, కార్యకర్తలు చొరవ చూపాలని చెప్పారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో హుస్నాబాద్ నియోజకవర్గంలో భారీ మెజార్టీతో కాషాయ జెండా ఎగురవేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పని చేసి రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు గెలుపే ప్రధాన లక్ష్యంగా పని చేయాలని తెలిపారు. సమావేశంలో హుస్నాబాద్ నియోజకవర్గ నాయకుడు జన్నారపు సురేందర్‌రెడ్డి, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, మండల నాయకులు ఎర్రగొల్ల శ్రీనివాస్, శ్రీవర్ధన్, కంచర్ల శంకరయ్య, వెంకటేష్, కిష్టయ్య, సదానందం, మధుకర్, ఆదామ్, దేవేందర్‌రెడ్డి, కపివర్ధన్, బిట్ల లింగయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు'ను వినియోగించుకోండి

పరకాల : కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పరకాల మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి కోరారు. పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులోని వెలమవాడ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటివెలుగు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కంటి సమస్యలున్న వ్యక్తులు ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరమైన వారికి అద్దాలు అందించడంతోపాటు శస్త్రచికిత్స సైతం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్ స్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ బండి సారంగపాణి, కౌన్సిల్ సభ్యులు మడికొండ సంపత్‌కుమార్, దామెర మొగిళి, మార్క ఉమ, ఏకు రాజు, బీఆర్‌ఎస్ నాయకులు దగ్గు విజేందర్‌రావు, మార్క రఘుపతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



కంటివెలుగు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి

'ఉపాధి' పనులతో కూలీలకు ప్రయోజనం

దామెర : మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వినియోగించుకుంటే కూలీలకు ప్రయోజనం ఉంటుందని ఎంపీడీఓ ఎం.వెంకటేశ్వర్‌రావు కోరారు. మండలంలోని ఓగ్లాపూర్, పసరగొండ గ్రామాల్లో ఉపాధి హామీ పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం నర్సరీలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. పనులకు కూలీలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. ఆయన వెంట ఏపీఓ శారద, సర్పంచ్‌లు కేతిపల్లి సరోజన, మేడిపల్లి సాంబయ్య, ఓగ్లాపూర్ గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కేతిపల్లి శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శులు అమిత, మనోహర్, దుబాసి రాధాకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు ఉన్నారు.



పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ సరోజన

అంకితభావంతో పని చేస్తేనే సక్సెస్



మాట్లాడుతున్న డాక్టర్ విజయచందర్‌రెడ్డి

ఆత్మకూరు : బీజేపీ కార్యకర్తలు అంకితభావంతో పని చేస్తేనే పార్టీని బలోపేతం చేయడంలో సక్సెస్ అవుతామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఈనెల10 నుంచి 25 వరకు జరిగే స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌ల గురించి చర్చించారు. అనంతరం విజయచందర్‌రెడ్డి మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో స్ట్రీట్ మీటింగ్‌లను విజయవంతం చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను, కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. సమావేశంలో బీజేపీ స్ట్రీట్ కార్నర్ సమావేశాల కన్వీనర్ గురిజాల శ్రీరామ్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐర్నడ్ల సదానందం, ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, కిసాన్ సెల్ కన్వీనర్ వంగాల బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండిట్, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలి

కమలాపూర్ : ప్రభుత్వం ప్రస్తుత షెడ్యూల్‌లోనే భాషా పండితులు, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలని జేఏసీ రాష్ట్ర నాయకుడు గంగాధర్, జిల్లా నాయకుడు ఎఫ్ఎస్.అలీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో కమలాపూర్, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలకు చెందిన తెలుగు భాషా పండితులు, స్కూల్ అసిస్టెంట్లకు సోమవారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశం సందర్భంగా మధ్యాహ్న భోజన సమయంలో మండల నాయకులు విష్ణుమూర్తి, అల్లం నర్సయ్య, బత్తిని వేణుగోపాల్, పీఈటీ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గంగాధర్, అలీ మాట్లాడారు. భాషా పండితులు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. అనంతరం కోర్సు డైరెక్టర్ శివకుమార్‌కు వినతిపత్రం అందజేశారు.



వినతిపత్రం అందజేస్తున్న భాషా పండితులు

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడతాం

పరకాల : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేఖ విధానాలపై పోరాడతామని భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) అనుబంధ భవన నిర్మాణ సంఘటన రాష్ట్ర కార్యదర్శి అడగాని జనార్ధన్‌రావు తెలిపారు. బీఎంఎస్ ఆధ్వర్యంలో ఈనెల 14న తలపెట్టిన చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్‌ను పట్టణంలోని అమరధామం ఆవరణలో ఆయన సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతోపాటు ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపజేయాలని, వారానికి ఒకరోజు సెలవు ఇప్పించాలని, రూ.21 వేల గౌరవ వేతనం చెల్లించేలా చొరవ చూపాలని, అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, గుర్తింపు కార్డులివ్వాలని, కార్మికులను వేధించే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాలకులు కార్మిక వ్యతిరేక విధానాలను వీడాలని హితవు పలికారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు బొమ్మకంటి కుమారస్వామి, షరీఫ్, మేఘరాజ్, సాంబయ్య, తిరుపతి, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రేవంత్‌రెడ్డికి ఘనస్వాగతం

ఆత్మకూరు : టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి మండలంలోని గుడెప్పాడ్ గ్రామంలోని జంక్షన్‌లో కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నాయకులు రేవంత్‌కు పూలమాలలు వేసి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రేణులకు, ప్రజలకు రేవంత్‌రెడ్డి కరచాలనం ఇస్తూ అభివాదం తెలిపి ఉత్సాహం నింపారు. రేవంత్‌రెడ్డి జిందాబాద్ అంటూ కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు. అనంతరం అక్కడి నుంచి ములుగు జిల్లాలోని మేడారంలోని వనదేవతల దర్శనానికి రేవంత్‌రెడ్డి తరలివెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, నాయకులు బీరం రజనీకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అలువాల రవి, రేవూరి జయపాల్‌రెడ్డి, చిమ్మని దేవరాజు, వెల్దె వెంకటేశ్వర్లు, ఉడుత రాజ్‌కుమార్, కొమురారెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతుల కల్పనే ధ్యేయం

శాయంపేట : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌళిక వసతులు కల్పించడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం 'మన ఊరు–మన బడి' కార్యక్రమం అమలు చేస్తోందని పెద్దకోడెపాక సర్పంచ్ అబ్బు ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలోని హైస్కూల్‌లో ఈజీఎస్ నిధులతో చేపట్టిన కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, మరుగుదొడ్ల నిర్మాణానికి సోమవారం ఆయన భూమిపూజ చేసి మాట్లాడారు. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధిలో ముందుకు నడిపిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి, ఏపీఓ కీర్తి అనిత, ఏఈ శ్రీలత, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, ఎస్ఎంసీ చైర్మన్ కోగిల రవీందర్, ఫీల్డ్ అసిస్టెంట్ భిక్షపతి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న సర్పంచ్ ప్రకాశ్‌రెడ్డి

ఎమ్మెల్యే సహకారంతో రోడ్ల అభివృద్ధి

దామెర : పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సహకారంతో అంతర్గత రహదారుల అభివృద్ధి జరుగుతోందని దుర్గంపేట్ ఎంపీటీసీ, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము తెలిపారు. మండలంలోని దమ్మన్నపేట్‌లో రూ.15 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ, రూ.10 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన డ్రైనేజ్ పనులను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎమ్మెల్యే ధర్మారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని మండలానికి అధిక నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జాకిర్ అలీ, దళితబంధు చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, సర్పంచ్ పుల్యాల రాణి రఘుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాజు, డైరెక్టర్ దుబాసి అనిల్ నాయకులు దామెరుప్పుల శంకర్, జన్ను మల్లయ్య, రాజమౌళి, భిక్షపతి, నర్సింహారెడ్డి, బాబు, సత్యం పాల్గొన్నారు.



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న రాము, తదితరులు

9న మహాధర్నాను జయప్రదం చేయాలి

ధర్మసాగర్ (వేలేరు) : తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక పిలుపు మేరకు పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సాధనకు ఈనెల 9న హైదరాబాద్‌లో తలపెట్టన మహాధర్నాను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు సారంపల్లి వాసుదేవరెడ్డి కోరారు. వేలేరు మండల కేంద్రంలో బాణాల సుధాకర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలివ్వాలని, అర్హులందరికీ 120 గజాలు చొప్పున స్థలం కేటాయించి నిర్మాణానికి రూ.5 లక్షలు చొప్పున సాయం అందించాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి వేల్పుల రవి మాట్లాడుతూ ప్రతిఒక్కరు వ్యవసాయ కార్మిక సంఘంలో సభ్యత్వం తీసుకుని సమస్యల పరిష్కారం దిశగా ఉద్యమించాలని సూచించారు. ఐక్యపోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమౌతాయని స్పష్టం చేశారు. ఇళ్లు, స్థలాలు, ఇతర హక్కుల సాధన కోసం ప్రజలు ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో కొయ్యడ శంకర్, గడ్డమీది శ్రీను, రజిత, రాజేశ్వరి, శోభ, మంజుల, రేనా, మధురవేణి, రాజేశ్వరి, పుష్పాంజలి, నవరత్న, సమ్మక్క, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి